క్లుప్తంగా

## భూసార పరీక్షల ఆధారిత ఎరువులు వాడాలి



మాట్లాడుతున్న మంజులత

కొత్తపల్లి: విచక్షణ రహితంగా ఎరువులు వాడకుండా భూసార పరీక్ష ఫలితాల ఆధారిత ఎరువులు వాడాలని కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డా.మంజులత సూచించారు. ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా కొత్తపల్లి మండలం బద్దిపల్లి రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు.ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దత్తత గ్రామమైన నాగులమల్యాల, కొండాపూర్, బద్దిపల్లి గ్రామ రైతులకు భూసార కార్డులు పంపిణీ చేశారు. నేలలో ఆరోగ్య పరిరక్షణకు సస్యశాస్త్ర విధానాలు, సేంద్రియ ఎరువులు, జీవన ఎరువుల వాడకం, పచ్చిరొట్ట పంటలు పెంపొందించడం, పంట అవశేషాల యాజమాన్యం, పంట మార్పిడి చేయడం, అంతర పంటలు, మల్చింగ్ వంటి వాటిపై మంజులత వివరించారు. జీవ నియంత్రణ సూక్ష్మజీవుల ద్వారా విత్తన శుద్ధి, పురుగులు, తెగుళ్ల నివారణలో భూసారం కాపాడుకునే విధానాన్ని సీనియర్ శాస్త్రవేత్త ఏ.విజయ భాస్కర్ తెలియజేశారు. నేల ప్రాముఖ్యత, మట్టి నమూనా సేకరణను శాస్త్రవేత్తలు పి.మధూకర్‌రావు, జి.ఉషారాణి వివరించారు. సర్పంచ్ నాయిని ప్రసాద్, వ్యవసాయ విస్తరణాధికారిణి లలిత, ఆత్మ ఏటీఎం రమ్య , రైతులు పాల్గొన్నారు.

## ఐఎస్ఏ ఫెస్టివల్‌లో ఆకట్టుకున్న సైకత శిల్పం



కరీంనగర్‌కల్చరల్: ఏటా ఒడిస్సా రాష్ట్ర టూరిజం శాఖ ఆధ్వర్యంలో కోణార్క్ ఆలయ సమీపంలోని చంద్రభాగా నదీ తీరంలో నిర్వహించే ఇంటర్‌నేషనల్ సాండ్ ఆర్ట్ ఫెస్టివల్ మంగళవారం ఘనంగా ముగిసింది. కరీంనగర్‌కు చెందిన సైకత శిల్పి రేవెల్లి శంకర్ వరుసగా కల్చర్ అండ్ హెరిటేజ్, ఎకో టూరిజం, మహిళా సర్వతోముఖాభివృద్ధి, అతిథిదేవోభవ అంశాలపై సైకత శిల్పాలు రూపొందించారు. మంగళవారం 'భారతీయ సంస్కృతి ' అంశంపై తెలంగాణకు చెందిన కాకతీయ శిలాతోరణంతో పాటు శివుని సైకత శిల్పాన్ని రూపొందించి సందర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ముగింపు వేడుకల్లో ఫెస్టివల్ బ్రాండ్ అంబాసిడర్, పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు శంకర్‌కు అభినందనలు తెలిపారు.

## నోట్‌బుక్స్ పంపిణీ

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం మల్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం భరత్‌రెడ్డి జ్ఞాపకార్థం నోట్‌బుక్స్, పండ్లను ఆయన తల్లితండ్రులు నరహరి లక్ష్మారెడ్డి, లక్ష్మీలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం డి.జ్యోతి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, భీమేశ్, వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

# సేవే లక్ష్యంగా..

- నిరుపేదలకు విద్యా, వైద్యం, ఉపాధిలో చేయూత
- అభాగ్యులకు అండగా వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు

జమ్మికుంట/మానకొండూర్‌రూరల్: నిరుపేదలు, అభాగ్యులకు ప్రతిఫలం ఆశించకుండా నిస్వార్థంగా సేవచేస్తూ వివిధ స్వచ్ఛంద సంస్థల ఫౌండర్లు, సభ్యులు సేవలో సంతోషాన్ని వెతుక్కుంటున్నారు. అంతర్జాతీయ స్వచ్ఛంద దినోత్సవం సందర్భంగా కష్టాల్లో ఉన్నవారికి లాభాపేక్ష లేకుండా సేవ అందిస్తున్నారు. అందులో ఒకటి ఆలయ ఫౌండేషన్. విద్య, వైద్యం, ఉపాధితో పలువురి జీవితాల్లో వెలుగులు నింపుతోంది. ప్రేమే మార్గంగా.. సేవే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పాలకుర్తి మండలం, బసంతనగర్‌కు చెందిన పరికిపండ్ల నరహరి ఐఏఎస్ అధికారి ఆలయ ఫౌండేషన్‌ను 2015లో స్థాపించాడు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రిన్సిపల్ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తు, కోఆర్డినేటర్స్‌తో ఫౌండేషన్ నిర్వహణ కొనసాగిస్తున్నారు. కరోనా సమయంలో ఆయా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు శానిటైజర్స్, సోప్స్, నిత్యావసర వస్తువులు, సేవలు అందించారు.రాష్ట్ర, జిల్లా, మండలాల వారీగా 600 మంది కోఆర్డినేటర్స్ పని చేస్తున్నారు. పేదలను గుర్తించి చేయూత అందిస్తున్నారు. ఎల్లలు లేని సేవా దృక్పథంతో ముందుకు వెళ్తున్నారు. హైదరాబాద్ వారి అభయ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు సుంకు బాలచంద్ర ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా అందిస్తున్న సేవలో భాగంగా మానకొండూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో స్వచ్ఛందంగా సేవాకార్యక్రమాలు చేపడుతున్నారు. పేదలు, వితంతువులు, పలువురికి నేనున్నానంటూ అభయ మిస్తూ కుట్టుశిక్షణ, మెహందీ, బ్యూటీషియన్, డ్రైవింగ్‌లో మూడునెలలు శిక్షణ ఇచ్చి ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తున్నారు. కొండపల్కల, అన్నారం, మానకొండూర్, ఊటూర్, పచ్చునూర్, దేవంపల్లి గ్రామాల్లోని పేద కుటుంబాలకు చెందిన సుమారు 500 మంది పైగా మహిళలకు శిక్షణ ఇచ్చి సబ్సిడీ ద్వారా పరికరాలు కూడా అందించారు. దుప్పట్లు, గొడుగులు, విద్యార్థులకు పుస్తకాలు, అనారోగ్యం బారినపడినవారికి ఉచితంగా మందులు, నిత్యావసర సరుకులు అందిస్తున్నారు. నిస్వార్థం, స్వచ్ఛందంగా సేవ చేస్తూ ప్రజల మదిలో సు స్థిర స్థానం సంపాదించుకుంటున్నారు. ఈ స్వచ్ఛంద సంస్థల సేవలను ప్రజలు అభినందిస్తున్నారు.



కుట్టుమిషన్ అందిస్తున్న అభయ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ సుంకు బాలచంద్ర(ఫైల్)



ట్రైసైకిళ్లు అందజేస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు,ఫౌండర్ పరికిపండ్ల నరహరి(ఫైల్)



జైపూర్ ఫూట్స్ అందజేస్తున్న (ఫైల్)

### సేవ చేయడం అదృష్టం



ఆలయ ఫౌండేషన్ స్థాపన నుంచి పేదలకు విద్య, వైద్యం , యువతకు చేయూత అందిస్తున్నాం. ఉపాధి కోసం ఫౌండేషన్ ద్వారా నిరుపేదలకు రాబోయే రోజుల్లో మరింత మందికి భరోసాగా నిలుస్తాం. సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. – గాదె గుణసాగర్, ఆలయ ఫౌండేషన్ స్టేట్ కోఆర్డినేటర్, జమ్మికుంట

### మర్చిపోలేని సాయం



మాది పేద కుటుంబం, ఇటీవల వైద్యులు కాలు తొలిగించారు. జైపూర్ ఫూట్‌కు రూ. యాభైవేలు ఖర్చు అవుతుందన్నారు. డబ్బులు లేకఆలయ ఫౌండేషన్ ప్రతినిధులను సంప్రదించాను. పైసా ఖర్చు లేకుండా కృత్రిమకాలు అమర్చారు. సాయాన్ని జీవితంలో మర్చిపోలేను, –ముదెత్తుల మల్లయ్య, కొత్తపల్లి, జమ్మికుంట

### ఆర్థికంగా వెసులుబాటు



అభయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ నేర్చుకున్నాను. తర్వాత సంస్థలోనే మహిళలకు శిక్షణ ఇవ్వడం సంతోషంగా ఉంది. కుట్టుశిక్షణ ద్వారా ఇంటి అవసరాలకు డబ్బులు సర్దుబాటు అవుతున్నాయి. – ఆరెల్లిస్వప్న, ట్రైనర్, మానకొండూర్

### కుటుంబానికి చేదోడుగా



మెహందీలో శిక్షణ తీసుకున్నా, వివాహాది శుభ కార్యక్రమాలు, పండుగలకు మంచి గిరాకీ వస్తోంది. ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. కుటుంబానికి చేదోడువాదోడుగా సహాయపడుతున్నాను. – ఆర్.దివ్య, మానకొండూర్

### సద్వినియోగం చేసుకోవాలి



అభయ స్వచ్ఛంద సంస్థ ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడం సంతోషం. గ్రామీణ ప్రజలు ముందుకు వచ్చి ట్రైనింగ్ తీసుకుని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సంస్థ శిక్షణను ఉపయోగించుకోవాలని కోరుతున్నాం. – ఆరెల్లి అరుణప్రభంజన్, అభయ స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్

## విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి అనురాగరేఖ

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థినులకు మంగళవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. హుజూరాబాద్ ప్రాంతీయ ఆరోగ్యశాఖకు చెందిన వైద్యురాలు అనురాగరేఖ ఆధ్వర్యంలో వైద్య బృందం పరీక్షలు చేశారు. ఎత్తు, బరువు కొలిచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. విద్యార్థినుల్లో రక్తహీనత కనిపిస్తోందని ప్రతిరోజు ఐరన్ ఉండు ఆహారం తీసుకోవాలన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై శ్రద్ధకనబరుస్తారని, ఆరోగ్యానికి కావాల్సిన ఐరన్, ప్రోటీన్ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. వేలకు భోజనం చేస్తే ఏకాగ్రత లోపించదని, చదువులో రాణిస్తారని తెలిపారు. కొందరు విద్యార్థినులను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం శారద, ఫార్మాసిస్టు శ్వేతారెడ్డి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్‌రావు, ఉపాధ్యాయులు రాజమౌళి, శ్యామయ్య, జ్యోత్స్న, శంకరమ్మ, శంకర్ పలువురు పాల్గొన్నారు.

## స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు

మానకొండూర్‌రూరల్: మండలంలోని వెల్ది జెడ్పీహెచ్‌ఎస్‌లో అంతర్జాతీయ వలంటీర్ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ స్వచ్ఛ భారత్ మిషన్ క్లస్టర్ కోఆర్డినేటర్ కళ్యాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. నీటి పొదుపు, ప్రాముఖ్యత, స్వచ్ఛత ఆవశ్యకత, తినక ముందు,తర్వాత చేతులు శుభ్రం చేసుకోవడం, స్వచ్ఛందంగా సేవ చేయడం వంటి విషయాలను పిల్లలకు తెలియజేశారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, గ్రామకార్యదర్శి సంపత్, గ్రామ మహిళా వలంటీర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతిని కాపాడుకోవడం అందరి బాధ్యత



మాట్లాడుతున్న నవీన్‌కుమార్

కరీంనగర్ సిటీ: ప్రకృతిని కాపాడుకోవడం అందరి బాధ్యత అని కరీంనగర్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి తెలిపారు. కళాశాలలో ఐక్యూఏసీ ఆధ్వర్యంలో మంగళవారం సుపోషన్ కార్యక్రమం నిర్వహించారు. సంస్కృతి చైర్మన్ నవీన్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోషకాల అవశ్యకతను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. ప్రకృతికి నష్టం కలిగించకుండా చేపట్టాల్సిన చర్యలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కో– ఆర్డినేటర్ డి.చక్రవర్తి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ లావణ్య, శకుంతల, సుజాత, అరుణ పాల్గొన్నారు.

## మహాపడిపూజ



కొత్తపల్లి: కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ విద్యా సంస్థల కేంద్ర కార్యాలయంలో మంగళవారం రాత్రి అయ్యప్ప మహాపడిపూజ మహోత్సవం వైభవంగా జరిగింది. చక్రవర్తుల పురుషోత్తమాచార్యులు గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన పదునెట్టంబడి పూజా కార్యక్రమాన్ని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ దంపతులు వి.నరేందర్ రెడ్డి, వి.వనజారెడ్డిలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మహా గణపతి పూజతో ప్రారంభమై సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్పస్వామి పడిపూజ వైభవోపేతంగా సాగింది. హరిహర పుత్ర అయ్యప్పస్వామిని పుష్పాలు, సుగంధ ద్రవ్యాలు, ఫల పంచామృతాలతో అభిషేకం చేశారు. అయ్యప్ప భక్తులు ఆలపించిన భజన పాటలతో అల్ఫోర్స్ ప్రాంగణం మారుమ్రోగింది. అనంతరం అయ్యప్ప స్వాములు, భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అల్పం అందించారు. లోకకల్యాణార్థమై, మానవాళి శ్రేయస్సుకై ఏటా వైభవోపేతంగా అల్ఫోర్స్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తుండటం ఆనందంగా ఉందని నరేందర్‌రెడ్డి తెలిపారు. అల్ఫోర్స్ పాఠశాలలు, కళాశాలల సిబ్బంది, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

## ఏకాగ్రత అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న రామస్వామి

చొప్పదండి: విద్యార్థులు ఏకాగ్రత అలవర్చుకోవాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు రామస్వామి అన్నారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ప్రిన్సిపాల్ స్వాతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఏకాగ్రతతో పాఠాలు అర్థమవుతాయని, సందేహాలు నివృత్తి చేసుకోవచ్చన్నారు. విజ్ఞానంతో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు పేరుప్రతిష్ఠలు తీసుకురావాలని కోరారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ అలివేల దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

## రెండో విడత పాఠ్యపుస్తకాల పంపిణీ



పుస్తకాలను పరిశీలిస్తున్న సీఆర్పీలు

హుజూరాబాద్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండో విడత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయనున్నామని మండల విద్యాధికారి కేతిరి వెంకటనరసింహారెడ్డి తెలిపారు. మండలంలోని 50 పాఠశాలల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుల ద్వారా పుస్తకాలు అందజేస్తామని తెలిపారు. రెండు రోజుల్లో స్కూళ్లకు సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు గూండా రాజిరెడ్డి, రంగు దామోదరాచారి, రవిబాబు, సుధామన్, మధు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బలగాలకు వీడ్కోలు



వీడ్కోలు పలుకుతున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

జమ్మికుంట: ఎన్నికల నేపథ్యంలో హుజూ రాబాద్ డివిజన్ జమ్మికుంటలో పోలీసులు, కేంద్ర బలగాల విధులు సమర్థవంతంగా నిర్వహించారు. కేంద్ర బలగాలకు హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వీడ్కోలు పలికారు. విధులు సక్రమంగా నిర్వహించారని శాలువాలతో సత్కరించి, పూలమాలలు వేసి సన్మానించారు. టౌన్ సీఐ బార్పటి రమేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### ఉచిత నేత్ర వైద్యశిబిరం

కరీంనగర్: నగరంలోని కోరా ఉన్నత పాఠశాలలో మంగళవారం వాసన్ కంటి సంరక్షణ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులు విటమిన్–ఏ లోపం వల్ల కంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. మొబైల్ ఫోన్లకు పిల్లలు దూరంగా ఉండాలని తెలిపారు. సరైన వెలుతురులో చదువుకుంటూ కంటిని ఆరోగ్యంగా చూసుకోవాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహచలం హరికృష్ణ, సంతోష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.









## ముసురుకున్న వాన

మిచాంగ్ తుపాను ముసురుకుంది. కరీంనగర్‌లో మంగళవారం చిరుజల్లులతో కూడిన వర్షం కురియడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అత్యవసర పనుల నిమిత్తం బయటికి వెళ్లిన వారు తలపై రక్షణగా చున్నీలు, టవళ్లు, కవర్లు కప్పుకున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

## కాంగ్రెస్ నాయకుల సంబరాలు

హుజూరాబాద్: రాష్ట్ర సీఎంగా ఎనుముల రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించడంతో మంగళవారం రాత్రి పట్టణంలో పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ వేడుకల్లో నాయకుల, కార్యకర్తలు పాల్గొన్నారు.
గన్నేరువరం: కాంగ్రెస్ అధిష్టానం రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిని ప్రకటించడం పట్ల పార్టీ నాయకులు మంగళవారం మండల కేంద్రంలో సంబరాలు చేసుకున్నారు. టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్, గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి అంజిరెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అనిల్, మండల కోఆర్డినేటర్ కొలుపుల రవీందర్, దేశరాజ్ అనిల్, వెదిరే విజేందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
శంకరపట్నం: మానకొండూర్ ఎమ్మెల్యేగా కవ్వంపల్లి సత్యనారాయణ గెలుపొందడం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపడుతున్న సందర్భంగా మండలంలోని గద్దపాక గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఆంజనేయుని ఆలయం వద్ద 101 కొబ్బరికాయలు కొట్టి అభిమానం చాటుకున్నారు. అనంతరం గ్రామదేవతలకు మొక్కులు చెల్లించారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు బసవయ్య, తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో నాయకుల సంబురాలు



గన్నేరువరం మండల కేంద్రంలో...



కొబ్బరికాయలు కొడుతున్న కార్యకర్తలు